బస్తీ దవాఖానాకు సుస్తీ



ఆదిబట్ల బస్తీ దవాఖాన

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, పరికరాలు కరువు
- అందుబాటులో లేని రేబిస్, స్నేక్‌బైట్ ఇంజక్షన్లు
- సాధారణ జబ్బులకే మందులు
- అత్యవసరమైతే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బస్తీ దవాఖానకు సుస్తీ చేసింది. మంచి లక్ష్యంతో దవాఖానను ప్రారంభించినప్పటికీ ప్రజలకు వైద్య సేవలందడం లేదు. జలుబు, దగ్గు, జ్వరం, నొప్పులకు తప్ప మిగతా వ్యాధులను గుర్తించే నాథుడే లేకుండా పోయాడు. వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సే దిక్కైంది. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో గత సంవత్సరం అక్టోబర్ 12న ఆదిబట్ల ఎస్సీ కాలనీలో బస్తీ దవాఖానను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో 15వేల మంది జనాభా నివాసం ఉంటారు. రాందాస్‌పల్లి, బొంగ్లూర్, ఆదిబట్ల, మంగళ్‌పల్లి, ఎంపీపటేల్‌గూడ, కొంగరకలాన్ ప్రాంతాలతో పాటు కొత్తగా వెలిసిన కాలనీలు ఇందులోకి వస్తాయి.

తొమ్మిదినెలలుగా పోస్టు ఖాళీనే..

ఆదిబట్లలోని బస్తీ దవాఖాన ప్రారంభించి నేటికి తొమ్మిది నెలలు పూర్తవుతోంది. అప్పటి నుంచి స్టాఫ్ నర్సుతో పాటు సపోర్టింగ్ సిబ్బంది మాత్రమే ఉన్నారు. ప్రతి రోజు 25–30 మంది వరకు రోగులు బస్తీ దవాఖానకు వస్తున్నారు. ముఖ్యంగా జలుబు, జ్వరం, శరీరం నొప్పులు, దగ్గు లాంటి మందులు ఇచ్చి పంపుతున్నారు. డాక్టర్‌ను మాత్రం ప్రభుత్వం కేటాయించలేకపోతుంది. పూర్తి స్థాయిలో మందులు కూడా అందుబాటులో లేవు.

రేబిస్, పాముకాటు టీకాలూ కరువు..

పెద్ద జనాభా ఉన్న బస్తీ దవాఖానలో.. పాము కాటు, కుక్కకాటు మందులు అందుబాటులో లేవు. డాక్టర్ వస్తేనే ఈ మందులు అందుబాటులోకి వస్తాయని స్టాఫ్ నర్సు తెలిపారు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి దవాఖానాకు వైద్యుడిని కేటాయించాలని కోరుతున్నారు. అప్పుడప్పుడు ఎల్మినేడు పీహెచ్‌సీ నుంచి మెడికల్ అధికారి వచ్చి పర్యవేక్షించడం తప్ప పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండరని ప్రజలు అంటున్నారు.

పడిపోతున్న రోగుల సంఖ్య..

మంచాల: మంచాల ప్రభుత్వ వైద్యశాలలో రోగుల సంఖ్య రానురాను తగ్గిపోతోంది. గతంలో రోజుకు 80 నుంచి 100 మంది వరకు వచ్చేవారు. ప్రస్తుతం 50 నుంచి 60 మంది మాత్రమే వస్తున్నారు. ఇక్కడ అల్ట్రాసౌండ్, ఎక్సరే మిషన్లు అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలకు ఇబ్బందిగా మారింది. మంచాల మండలంలో ఆరుట్ల, మంచాల రెండు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కనీసం మండల కేంద్రంలో ఉన్న మంచాల ప్రభుత్వ వైద్యశాలలో అన్నిరకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

“మందులు ఇచ్చి పంపుతున్నాం



దవాఖానకు రోజు పేషెంట్లు వచ్చి పోతుంటారు. పూర్తిస్థాయి డాక్టర్ అందుబాటులో లేరు. దీంతో కేవలం మందులు ఇచ్చి పంపుతున్నాను. బీపీ, షుగర్ బిల్లలు కూడా ఇస్తున్నాం. రక్త పరీక్షలు కూడా చేయిస్తున్నాం. డాక్టర్‌ను కేటాయించాలి.

– ఉషావేణి, స్టాఫ్ నర్సు, ఆదిబట్ల బస్తీ దవాఖానా

డాక్టర్‌ను కేటాయించాలి



ఆదిబట్లలో ఇంత జనాభా ఉన్నప్పటికీ దవాఖానలో ప్రభుత్వ డాక్టర్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి బస్తీ దవాఖాన పెట్టారు బాగుంది. తక్షణమే డాక్టర్‌ను కేటాయించాలి. సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలి.

– రాజు, మాజీ సర్పంచ్, ఆదిబట్ల

క్లుప్తంగా

కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడిగా బాల్‌రాజ్



నియామకపత్రం అందుకుంటున్న బాల్‌రాజ్

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ నగరంలోని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా బాల్‌రాజ్ నియామకప్రతం అందుకున్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, విష్ణు, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌కు సత్కారం



ట్రాఫిక్ డీసీపీని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీగా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన డీసీపీ శ్రీనివాస్‌ను ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సోమవారం డీసీపీ శ్రీనివాస్‌ను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేశ్, సభ్యులు రాంచంద్రారెడ్డి, వెంకట్, మధన్‌గౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి

సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్



మల్లేశ్‌గౌడ్‌ను సన్మానించిన నాయకులు

కడ్తాల్: గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. నూతనంగా ఎన్నికైన ఆయన్ను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు వెంకటయ్య, యాదయ్యగౌడ్, సత్యం యాదవ్, శ్రీను, రాజేశ్, రాజేందర్, శ్రీకాంత్, రమేశ్, శ్రీశైలం, మహేశ్, నరేశ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కలుషిత నీటితో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. తాగునీరు అపరిశుభ్రం కాకుండా చూడాలని, క్రమం తప్పకుండా చెత్తసేకరణ చేపట్టాలని, పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్, దోమల లార్వాలను నివారించే రసాయనాలు, బ్లీచింగ్ పౌడర్ వాడాలని తెలిపారు. త్వరలో వైద్య విభాగం అధికారులతో కూడా సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోతుల దాడిలో గాయపడిన అంగన్‌వాడీలను ఆదుకోవాలి



ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కోతుల దాడిలో గాయపడ్డ అంగన్‌వాడీ టీచర్, ఆయాలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణ, రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం సెలవు రోజున రాయపోల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవాలని ఆదేశాలు జారీ చేసిన సీడీపీఓ శాంతిశ్రీ కోతల దాడిలో గాయపడ్డ టీచర్ భారతమ్మ, ఆయా తహేరా బేగంను ఆదుకోవాలని సోమవారం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మూడుగంటల పాటు అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, యూనియన్ నాయకులు బేబీ, బాలమణి, వైదేహి, పద్మ పాల్గొన్నారు.

అసెంబ్లీ టికెట్ గిరిజనులకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీచేసే అవకాశాన్ని లంబాడాలకే కల్పించాలని గిరిజన ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ నివాసంలో నియోజకవర్గంలోని గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో 212 గిరిజన తండాలున్నాయని.. 50వేల వరకు గిరిజన ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో ముగ్గురు గిరిజన ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు, ఇద్దరు వైస్ ఎంపీపీలు, 60 మందికి సర్పంచ్‌లు, 15 మంది ఎంపీటీసీలు, 6గురు మున్సిపల్ కౌన్సిలర్లుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ న్యాయం చేశారని తెలిపారు. పార్టీలో అందరికీ సముచిత స్థానం కల్పిస్తున్నా.. కొంతమంది నాయకులు పార్టీ, సీఎం కేసీఆర్ నిర్ణయాలను ధిక్కరిస్తూ పార్టీలో వర్గాలను ఏర్పాటు చేసుకుని బీఆర్‌ఎస్ పార్టీని బలహీన పరుస్తున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఐక్యమత్యంగా ఏకతాటిపై ఉన్న లంబాడీలకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో గిరిజన అభ్యర్థిని కల్వకుర్తి నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయించి గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ పత్యానాయక్, వెల్దండ ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, వైస్ ఎంపీపీ శాంతి గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, సర్పంచ్‌లు సోనుశ్రీను, కమ్లీ బీచ్యా, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, సరితా పంతునాయక్, ప్రియా రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన నీలాల వసంత, గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ యాదవ్ పరామర్శించి రూ.5వేలు సాయం అందిచారు. పరామర్శించిన వారిలో యూత్ సభ్యులు కేఎం గౌడ్, రామకృష్ణ, మహేశ్, శ్రీశైలం, నర్సింగ్ శ్రీశైలం, గిరి, అనిల్ తదితరులు ఉన్నారు.

ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని యడవల్లికి చెందిన చెన్నమ్మ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందింది. ఐక్యతాఫౌండేషన్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. సోమవారం ఫౌండేషన్ సభ్యులచే రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కారయక్రమంలో రాములు, బుచ్చయ్య, సూర్యానారాయణ, ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుల్లమ్మ (61) అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. సర్పంచ్ రమేష్‌యాదవ్, ఎంపీటీసీ సునీత, దర్శన్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ రమేష్‌యాదవ్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ.3000, వ్యక్తిగతంగా ఎంపీటీసీ రూ.2000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శేఖర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయండి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి హోంగార్డుల వినతి



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

ఇబ్రహీంపట్నం రూరల్: హోంగార్డులను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని హోంగార్డులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు ఎమ్మెల్యేకు హోంగార్డులు వినతిపత్రం అందజేశారు . సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు శ్రీశైలం ,మహేందర్, గణేష్, భాస్కర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న రమేష్, నాయకులు

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో 30 సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు విరాళాలు అందజేశారని మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ అన్నారు. సోమవారం సీఐ మాట్లాడుతూ.. ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ ప్రోత్సాహంతో ఈ విరాళాలు అందించారని తెలిపారు. విరాళాలు అందించిన వారిలో ప్రధానంగా మొద్దు సికిందర్‌రెడ్డి రూ.50వేలు, బెంద్యాల వెంకటేశ్వర్లు రూ.50వేలు, రావుల జంగయ్య రూ.50వేలు మరికొంతమంది వారికి తోచినంతగా సహాయం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ రవినాయక్, ఆరుట్ల ఉప సర్పంచ్ జంగయ్యగౌడ్, స్థానిక నాయకులు రాము, వెంకటేశ్వర గుప్తా, లక్ష్మారెడ్డి, అషు, రాకేష్‌రెడ్డి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ కుమార్



ప్లాంటేషన్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కుమార్, నాయకులు

తలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బక్కి కుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని చంద్రధనలో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద మండల పరిధిలోని చంద్రధనలో రైతు గోదా సురేందర్‌గౌడ్‌కు నాల్గున్నర ఎకరాలకు మామిడి తోట మంజూరైంది. ఈ సందర్భంగా సోమవారం సర్పంచ్, ఈసీ కృష్ణ, వార్డుసభ్యులతో కలిసి మామిడి మొక్కలు నాటి ప్లాంటేషన్ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యతిస్తుందని, వ్యవసాయానికి అనుబంధంగా పండ్ల తోటలను పెంపు చేసుకొని రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. రైతులకు సహాయం అందిస్తామన్నారు. దేవేందర్‌గౌడ్, సరేందర్‌గౌడ్, రమేష్, తిరుపతయ్య, రైతులు పాల్గొన్నారు.

గౌరిపల్లిలో పంటల పరిశీలన

తలకొండపల్లి: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏఓ రాజు అన్నారు. యజమాన్య పద్ధతులు పాటించినట్‌లెతై అధిక దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని గౌరిపల్లిలో సోమవారం ఆయన ఏఈఓ శ్రీనాథ్‌తో కలిసి మొక్కజొన్న, పత్తి పొలాలను పరిశీలించారు. అధిక వర్షాలతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చడపీడల నివారణ, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహేష్, మల్లమ్మ, శ్రీపతిరావు, రైతులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మాలెపల్లి, విఠాయిపల్లి గ్రామాల్లో సోమవారం వివిధ పంటలను మండల వ్యవసాయాధికారి అరుణ కుమారి పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా పంటల్లో పోషక విలువలు లోపించాయని పోషక లోపాలకు ఫార్ములా 4 ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. పత్తిలో మొక్కలు ఎర్రబారిపోకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ ఎకరాకు 500 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ ఎకరాకు 2కిలోల చొప్పున మొక్కల మొదళ్లలో వేయాలని ఆమె సూచించారు. వరిలో 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివతేజ, రైతులు అనంతరెడ్డి, హనుమంతు, శరణప్ప, గోపాల్, మంగ్య, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003–04 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల అనంతరం ఒక్కచోట చేరి గత జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ విద్యార్థులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన గుమ్మల్ల సాయిరెడ్డికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కిం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.62,500 మంజూరయ్యాయి. మంగళపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గుమ్మల్ల సాయిరెడ్డికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ ఉపసర్పంచ్ మురళి, నాయకులు వెంకటేశ్, యాదయ్య, నర్సింహ, నర్సిరెడి పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా చెరువులు, కుంటలు నిండి లీకేజీలు కాకుండా మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో చెరువులు, కుంటల సమీపాల్లోనే వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని, కాల్వల కబ్జాకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని.. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇరిగేషన్ డీఈఈ మంజుల, ఏఈఈ జయ, నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

తుర్కయంజాల్: పురపాలక సంఘం నూతన టౌన్ ప్లానింగ్ అధికారిగా అలీపాషా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన మేడ్చల్ జిల్లాలోని కొంపల్లితో పాటు తుర్కయంజాల్‌కు ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అధికారిగా కొనసాగనున్నారు. సోమవారం, మంగళవారం, బుధవారం తుర్కయంజాల్‌లో అందుబాటులో ఉండనున్నారు. అలీపాషా గతంలో కూడా ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన విషయం తెలిసిందే.

ఆదిబట్ల సీఐగా రఘువీర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్ నూతన సీఐగా రఘువీర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నిన్నటివరకు ఆదిబట్ల సీఐగా పనిచేసిన రవి కుమార్‌ను ఎస్‌ఓటీ–2కి బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఆర్‌బీలో పనిచేస్తున్న రఘువీర్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అదే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ లక్ష్మినారయణను పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు. ఆదిబట్ల సీఐగా పనిచేసిన రవికుమార్ ఏడు నెలలకే బదిలీపై వెళ్లడం విశేషం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ వెంకట్‌రెడ్డి

యాచారం: స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక రాష్ట్రస్థాయి పోటీలకు యాచారం మండలం నుంచి ఆరు మంది విద్యార్థులు ఎంపికయ్యారు. జూలై 14న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీల్లో యాచారం మండలం నుంచి 25 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటిలో మంచి ప్రతిభ చూపిన ఆరు మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి అభినందించారు. ఆగస్టు 12న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేందర్, ఫిజికల్ డైరెక్టర్లు దేవదాసు, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఆమనగల్లు: వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తుందని ఆయన చెప్పారు. మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం రూ.20 లక్షలతో నిర్మించే పల్లె దవాఖానా భవన నిర్మాణానికి శంకుస్థాపన, వైకుంఠధామం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావ్, లాలయ్యగౌడ్, రాంచంద్రయ్య, నిరంజన్‌గౌడ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, పీఆర్ఎఈ సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ..

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల్ నుంచి వంపుగూడ, చల్లంపల్లి, సాలార్‌పూర్ గ్రామాల మీదుగా పడకల్ గేట్ వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్‌రోడ్డును.. డబుల్‌రోడ్డుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రూ.18.90 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో కడ్తాల్, తలకొండపల్లి మండలాల ప్రజలకు రవాణ సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. త్వరలోనే డబుల్‌రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

పల్లెల్లో పచ్చదనం భేష్

ఈజీఎస్ కేంద్ర బృంద సభ్యురాలు గుహంబికా



తక్కళ్లపల్లి తండావాసులతో ఈజీఎస్ బృందం

యాచారం: పల్లెలు పచ్చదనంగా ఆకర్షిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో జరిగే అభివృద్ధి సంతోషకరంగా ఉందని ఈజీఎస్ పథకం కేంద్ర బృంద సభ్యురాలు గుహంబికా పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల తీరుపై సోమవారం తక్కళ్లపల్లితండాలో ఆమె పర్యటించి అధ్యయనం చేశారు. ఈజీఎస్ నిధులతో గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, మరుగుదొడ్లు, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. తాగునీటి సరఫరా, వ్యాధుల నివారణ కోసం వైద్య సిబ్బంది తీసుకుంటున్న చర్యలు, అవగాహన సదస్సులపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుకన్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, తక్కళ్లపల్లితండా సర్పంచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను అరికట్టండి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పాస్టర్ల సంఘం ప్రతినిధులు

ఇబ్రహీంపట్నంలో పాస్టర్ల ర్యాలీ

ఇబ్రహీంపట్నం రూరల్: మణిపూర్ ఘటనలకు నిరసనగా ఇబ్రహీంపట్నంలో సోమవారం క్రిస్టియన్స్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ మంటల్లో కాలుతున్నా.. కేంద్ర ప్రభుత్వం మౌనం వీడటం లేదన్నారు. మణిపూర్ ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. వారికి న్యాయం జరిగేవరకు పోరాటం ఆపేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు సుందర్, సత్యం, కరుణాకర్, చెరుకూరి రాజు, సన్నుతు, సైమన్‌పీటర్, కృష్ణపాల్, నానునాయక్, రవికుమార్, భాస్కర్, జయకుమార్, రమేష్, మధుకర్, జయరాజ్, ఆశీర్వాదం, శ్రీనివాస్, సదానంద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.